# మా తెలుగు తల్లి

ప్రార్థనా గీతం పాడబోతుంటే పదివేలమంది ఉన్న సభలో రెండు రెండువేల మంది నిలబడ్డారు.

ఇరవైమంది ఉన్న వేదిక మీద అధ్యక్షత వహిస్తున్న స్త్రీమూర్తి నిలబడింది.

పాడేగీతం మా తెలుగు తల్లికి మల్లెపూదండ

పాడే గాయకుడు సుప్రసిద్ధ బాలసుబ్రహ్మణ్యం

సందర్భం తెలుగు మహాసభల ప్రారంభోత్సవం

తోడ్పడేది ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం, తెలుగు విశ్వవిద్యాలయం, భారతదేశ తెలుగు సంఘాల సమాఖ్య.

జరిపేది కామరాజు అరంగంలో, చెన్నైలో, తమిళాన్ని తల్లికంటె మిన్నగా ప్రేమించే తమిళ సోదరుల సమక్షంలో. సంగీతం కోసం తెలుగును తమిళంతో సమానంగా గౌరవించే వాళ్ళ సన్నిధిలో, తమ మాతృభాషకు ప్రాచీన భాషగా గుర్తింపు భారతదేశ గౌరవం పొందిన వాళ్ళ సమీపంలో, తమిళానికి ప్రపంచ భాషగా ప్రత్యేక ప్రాముఖ్యం కోరుతున్న దీక్షా దక్షుల రాజధానిలో.

హాజరయ్యేది ఆంధ్రరాష్ట్ర ప్రతినిధులు, అఖిలభారత తెలుగు సంఘాల ప్రతినిధులు, మలేషియా ప్రతినిధులు ముఖ్యంగా తమిళనాడులో ఉన్న రెండున్నర కోట్ల తెలుగు వాళ్ళ ప్రతినిధులు.

ప్రార్థనా గీతంతో సభ ప్రారంభమవుతుందన్న స్త్రీమూర్తి, ప్రార్థన కాబట్టి, తెలుగుతల్లి ప్రార్థన కాబట్టి, తెలుగు ప్రార్థన కాబట్టి, గౌరవ సూచకంగా నిలబడింది.

మిగతా వాళ్ళను నిలబడమని కోరింది.

ఆమెను కూర్చోమని వేదికమీద ఉన్న నాయకులు ఆదేశించారు. ఆమె వినిపించుకోలేదు. నిలబడే ఉంది. మిగతా వాళ్ళు కూర్చునే ఉన్నారు.

వేదిక మీద కూర్చుని ఉన్న వాళ్ళలో చాలామంది ఆంధ్రదేశ నాయకులు. కొందరు మద్రాసు తెలుగు సంఘం ప్రముఖులు.

సభలో నిలబడ్డ వాళ్ళు మద్రాసు తెలుగువాళ్ళు, మలేషియా తెలుగువాళ్ళు, ఇతర

రాష్ట్ర సంఘాల ప్రతినిధులైన తెలుగు వాళ్ళు. కొందరు ఆంధ్రప్రదేశ్ తెలుగువాళ్ళు.

కూర్చున్న వాళ్ళలో ఎక్కువమంది తెలుగుతల్లి ముద్దుబిడ్డలే!

తమిళ తల్లి ముద్దు మురిపాల బిడ్డలందరూ తెలుగు మహాసభ ప్రార్థనా గీతానికి, సంగీతానికి ఆసక్తిగా నిలబడి ఉన్నారు.

ముందువరుసలో సభలో తెలుగు ప్రముఖుల్లో నలుగురు నిలబడ్డారు.

ప్రార్థన ప్రారంభం కాబోతూ ఉంది.

గాయకుడు మైకు పట్టుకొన్నాడు. ఆర్కెస్ట్రాను చూశాడు. పాట మొదలు పెట్టబోతున్నాడు.

తెలుగువాళ్ళ మాతృభాషా ప్రేమను చెన్నై తమిళులు చిన్న చూపు చూస్తారని ఎవరికైనా భయం కలగటం సహజంగా ఉన్న సందర్భంలో 'బాలూ! ఆగు!' కేక, అరుపు, గర్జన గాండ్రింపు ఆక్రోశం.

జనమంతా కేకను చూశారు వెనుక ఎక్కడో ! దూకుతూ వస్తున్నాడు కేక సొంతదారు.

బక్క పలచటి మనిషి. ఊపిరిలేని రూపం.

అన్ని టి.వి. కెమేరాలు, వేదికను వదిలి, సభను వదిలి అతనిమీద ఫోకస్ చేసి ఫిలిం తీస్తున్నాయి.

అన్ని కెమేరాలు క్లిక్కు మంటున్నాయి.

గాయకుడు పాడలేదు.

ఏమిటీ అపశ్రుతి?

అందరికీ ఉత్కంఠ!

అందనంత వేగంగా వేదికవైపు దూసుకు వస్తున్నాడు. ఎవరూ ఆపలేదు.

పాత్రికేయులు అడ్డుకొన్నారు. 'ఏం పేరు? ఏవూరు?'

'రామారావు, గుడివాడ' అంటూ దూకుతూ ఉన్నాడు.

గాయకుణ్ణి పాడమన్నారు పెద్దలు

పాడబోతుంటే 'ఆగు' అన్నాడు రామారావు. పిట్టమనిషి. గొంతు పిడుగు పడుతున్నట్లుంది.

ప్రార్థన ప్రారంభించలేదు.

మనిషి ఆగలేదు. వాలంటీర్లు ఆపబోయారు. అతనాగలేదు. తేగలాగా సాగి దూసుకుపోయాడు. నిలబడి ఉన్న జనం అతణ్ణి ఆపవద్దని అరుస్తున్నారు.

రామారావువి పైజామా, పొట్టిచేతుల చొక్కా! తోపులాటలో చొక్కా చిరిగింది.

సభలో నుంచి వేదిక మీదికి తూనీగలాగా ఎగిరిదూకాడు.

ఏభై అరవై ఏళ్ళుంటాయి. దేశస్వాతంత్ర్యం అతణ్ణి ప్రసవించి ఉంటుంది.

గొంతు ఖంగుమంటూ ఉంది. అది కళాకారుల గొంతు . ఆవేశపరుల గొంతు. దేశప్రేమికుల గొంతు, మాతృభాషాభక్తుల గొంతు.

గాయకుడి చేతిలోని మైకు రామారావు లాక్కొన్నాడు.

బాలు మైకు అతడి అందించి పక్కకు తప్పుకొని నిలబడ్డాడు.

'ఇది తెలుగు తల్లి ప్రార్థనా గీతం' అన్నాడు.

అతడి గొంతు బొంగురుపోయింది.

'ఇది తల్లిని పూజించే ప్రార్థన'

గొంతు రుద్ధమయింది.

'ప్రార్థన అంటే భయభక్తులుండాలి'

ఆవురుమని ఏడ్చేశాడు. ఏడుస్తూనే చెప్పాడు 'మన తెలుగు తల్లిని మనం ప్రేమించకపోతే–' వాక్యంపూర్తి చేయలేక పెద్దగా ఏడ్చాడు.

అతడి రూపం పేదవాడిది, ప్రేమ సంపన్నుడిది, తేజస్సు కళామూర్తిది, ఆవేశం ఆంధ్రుడిది.

'సోదరులారా! మన తల్లిని మనం గౌరవిద్దాం. ప్రార్థనకు గౌరవసూచకంగా లేచి నిలబడదాం' అభ్యర్థించాడు.

అతన్ని నిర్వాహకులు తాగి అవతల పారేయబోయారు. జనం–నిలబడ్డవాళ్ళు– 'ఆగండి' అని అరిచారు.

కార్యకర్తలు ఆగిపోయారు.

కూర్చున్న ఆంధ్రులు నెమ్మదిగా లేచి నిలబడుతూ ఉన్నారు.

వేదికమీది వాళ్ళు 'అతన్ని పక్కకు నెట్టండి' అన్నారు. ఎవరూ వినలేదు. ఎవరూ నెట్టలేదు.

సభలో అందరూ నిలబడి ఉన్నారు.

వేదికమీద వాళ్ళు ఒక్కొక్కళ్ళే చెప్పకుండా లేస్తున్నారు. ఇంకా చాలా మంది లేచి నిలబడాలి.

'నాయకులు ప్రజాసేవకులు, మాసేవకులు, సేవకులకు కూడా ప్రత్యేకంగా చెప్పాలా? లెండి. లేచి నిలబడండి!'

అనిష్టంగా లేస్తున్నారు.

'లెండి!' రామారావు గర్జించాడు.

'లెండి!' సభ గర్జించింది.

'లెండి!' సభ దద్దరిల్లింది.

అందరూ లేచి నిలబడ్డారు.

మైకు గాయకుడి చేతికిచ్చి, 'క్షమించు బాలూ! మనతల్లిని సంగీతంతో పూజించు,

గాయకుడు రామారావు పాదాలుతాకి ప్రార్థన ప్రారంభించాడు.

సభ నిశ్శబ్దం. మౌనం. గానం, సంగీతం, సాహిత్యం పూజ. మౌనం, సంగీతం, ప్రార్థన తప్ప ఏమీ వినిపించటం లేదు.

రామారావు చేతులు కట్టుకొని, తలవంచుకొని ఏడుస్తూ కట్టెలాగా, కడ్డీలాగా నిటారుగా, తెలుగువాడి పొగరులాగా నిలబడి ఉన్నాడు.

ప్రార్థన అయిపోయింది.

సభ దద్దరిల్లింది.

నిజమే, ప్రార్థనకు ఎవరూ చప్పట్లు కొట్టరు, తెలుగు వాళ్ళకు ఈ ఔచిత్యం తెలుసు.

కానీ సభ చప్పట్లతో దద్దరిల్లింది.

ఇది రామారావుకు అభినందన, గాయకుడికి ప్రోత్సహం. తెలుగు తల్లికి జోహారు. తెలుగు జాతికి సత్కారం.

చప్పట్లతో సభ మారు మ్రోగుతూనే ఉంది.

'తెలుగు వాళ్ళందరూ రామారావులాగాఉంటే, తెలుగు భాషను, జాతిని, ప్రదేశాన్ని అగౌరవించే దమ్ములు ఎవడికుంటాయి?'

ఎవరన్నారో, ఎవరు విన్నారో, ఎవరనుకొన్నారో, సభ అంతా ఆలోచనలో పడింది.

హర్షంలో ఉతికి ఆరేసినట్లుంది సభ.

ఆరోజు అందరిలో కలిసిపోయిన రామారావు ఆ మర్నాటి నుంచి, ఎక్కడున్నాడో, ఏమయ్యాడో, ఎవరికీ కనిపించలేదు.